PRGI No: TGBIL/25/A0946

విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్ సంపుటి : 02 సంచిక : 82 మంగళవారం, అక్టోబర్ 20 2026 , పేజీలు - 4 వెల : 5 రూ/-

ఎల్‌నినో పరిస్థితులపై

కేబినెట్ సబ్‌కమిటీ

- రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కార్యాచరణ.

హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ కమిటీని చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, తుమ్మల, వాకిటి శ్రీహరిలను సభ్యులుగా నియమించింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా సీఎం సలహాదారు రామకృష్ణారావు వ్యవహరించనున్నారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా ఉంటారు. ఇటీవల మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రివర్గ ఉపసంఘం ఎల్‌నినో పరిస్థితులు సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు ఇస్తుంది. రానున్న రోజుల్లో సాగు, తాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరత, రిజర్వాయర్లు, నిధుల నిర్వహణ కీలకం కానున్న నేపథ్యంలో... ఆయా శాఖల మంత్రులతో కేబ్‌నెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు చేయాల్సిన పనులు, కేంద్ర సహకారం వంటి అంశాలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చిసుంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలో నిమగ్నమైంది. వర్షాభావం కారణంగా సుమారు 11.18 లక్షల ఎకరాల్లోని పంటలు చేతికందే అవకాశం లేదనే అంచనాల నేపథ్యంలో? వివిధ శాఖల పరిధిలోని పరిస్థితుల నివేదికలను సేకరించి, ప్రత్యామ్నాయ చర్యలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇటీవల జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కన్నా 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లుగా అధికారులు అంచనా వేశారు. సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కూడా సర్కారు అంచనా వేస్తోంది. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయాన్ని అందించాలని ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల స్పెషల్ ప్యాకేజీని కేటాయించాలని కూడా కోరింది. ఎల్?నినోను ఎదుర్కొనేందుకు ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తాజాగా కేబినెట్ నిర్ణయం మేరకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో సబ్?కమిటీని ఏర్పాటు చేసింది.

ఎల్‌నినో ఎఫెక్ట్.. నీటి కొరత కారణంగా

రైతులు వరి సాగు చేయొద్దు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అక్టోబరు 19 : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గోదావరి నీళ్లకు అడ్డుకట్ట వేసేందుకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. దుమ్ముగూడెం ఆనకట్టపై మీటర్ ఎత్తున ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. (సోమవారం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్ట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఒక టీఎంసీ నీళ్లు నిల్వ ఉండేలా ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ పనులను దసరా రోజు ప్రారంభిస్తామని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటాయి. గోదావరి నదిలో నీళ్లు లేవని.. నీళ్లను విని యోగంలోకి తీసుకువచ్చేలా ప్రయత్నం చేస్తామని మంత్రి తు మ్మల తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సాగు చేయక పోయినా ఫర్వా లేదని.. కానీ చేతికందే పంటలు నీళ్లు లేక ఎండిపోయే దుస్థితి వద్దని అన్నదాతలకు సూచించారు. రైతన్నలు తక్కువ నీటి వినియోగం ఉండే పంటలు సాగు చేయాలని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడం నీటి కొరత కారణంగా రైతులు వరి సాగు చేయొద్దని సూచించారు. తాగునీటి కష్టాలు లేకుండా గోదావరి నీళ్లను నిల్వ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తాను వివరించానని చెప్పారు. తక్షణమే దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులను వెంటనే చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

కుప్పం ఎన్నికలు..

చైర్మన్ పదవికి 13



అమరావతి, అక్టోబర్ 19: కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. మున్సిపల్ చైర్మన్ స్థానంతో పాటు, వార్డు కౌన్సిలర్ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. దీంతో కుప్పంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ తరఫున రాజ్ కుమార్, వైసీపీ తరఫున గణేశ్ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఇక కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డు కౌన్సిలర్ స్థానాలకు గాను మొత్తం 282 నామినేషన్లు వచ్చాయి. అత్యధికంగా తెలుగుదేశం పార్టీ 146 నామినేషన్లు దాఖలు చేయగా, వైసీపీ 99 నామినేషన్లతో రెండో స్థానంలో నిలిచింది. జనసేన పార్టీ 13, బీజేపీ 2 నామినేషన్లు సమర్పించాయి. మరో 22 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, తదుపరి దశ అయిన నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ప్రక్రియలు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థుల జాబితాపై స్పష్టత రానుంది.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్, అక్టోబరు 19 : తెలంగాణ హైకోర్టు సమీపంలోని మదీనా వద్ద ఉన్న 'బాంబే హోజరీ'లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. (సోమవారం) తెల్లవారుజామున, హైకోర్టుకు ఎదురుగా ఉన్న మదీనా క్రాస్ రోడ్ వద్ద గల 'బాంబే హోజరీ' వస్త్ర దుకాణం, గోదాములో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. బాంబేహౌజరీ హోల్‌సేల్ షాప్, గోదాం నుంచి భారీగా పొగలు వెలువడుతున్నాయి. పొగల ధాటికి స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మంటలు ఇతర షాపులకు వ్యాపించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ కావడంతో భారీ ఎత్తున నష్టం ఉందని అధికారులు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మునుపెన్నడూ లేన ంత రసవత్తరంగా మారాయి. మహ బూ బ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్‌తో పాటు నల్గొ ండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గాల స్థానా లకు ఫారం-18 ద్వారా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈసారి ఓటర్ల జాబితాను పూర్తిగా కొత్తగా రూపొందిస్తుండటంతో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రధాన రాజకీయ పార్టీల న్నీ భుజాన వేసుకున్నాయి. అధికార కాంగ్రెస్ ఇప్పటికే తమ అభ్యర్థుల ప్రకటన, ఓటర్ల నమోదులో ముందంజలో నిలవగా, విపక్ష బీఆర్ఎస్ , బిజెపి మాత్రం తగు వ్యూహంతో తుది అభ్యర్థుల ఎంపికపై అంతర్గత కసరత్తును ముమ్మరం చేశాయి. బలమైన నేతల కోసం కేసీఆర్ అన్వేషణప్రధానంగా గులాబీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు ఈ గ్రాడ్యుయేట్ స్థానాలను దక్కించుకోవడాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అనంతరం విద్యావంతులు, ఉద్యోగులు, పట్టభ ద్రుల్లో బీఆర్ఎస్ పట్ల ఉన్న అభిప్రాయాన్ని సానుకూ లంగా మార్చుకోవడానికి ఈ ఎన్నిక లను ఒక సువర్ణావకాశంగా కేసీఆర్ చూస్తు న్నారు. ఇందులో భాగంగానే సాంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు స్థానిక సోషల్ ఇంజ నీరింగ్ సూత్రాన్ని పక్కాగా అమలు చేయాలని నిర్ణయించారు. ఉన్న నాయకులను బరిలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. క్యాడర్ నమ్మిన అభ్యర్థి అయితేనే గెలుపుఅధికారంలో లేని ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం పార్టీ కేడర్ పట్ల విధేయత మాత్రమే గెలుపును ఖాయం చేయలేదని బీఆర్ఎస్ అధిష్టానం గ్రహించింది. పట్టభద్రుల నియోజకవర్గాలు ఐదు ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం వల్ల, ప్రచారాన్ని గ్రామీణ స్థాయి వరకు వేగంగా తీసుకెళ్లగల అంగ బలం, అర్థ బలం ఉన్న నేతలకే ఓటు వేయాలని డిసైడ్ అయ్యారు. ఖర్చులు తట్టుకుని, సొంత బలంతో విస్తృత ప్రచారం చేసుకోగల ఆర్థిక పటిష్టత ఉన్న అభ్యర్థులతో కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పటికే ముఖాముఖి సమావేశాలు పూర్తి చేశారు. మరోవైపు, అధికార కాంగ్రెస్ పార్టీ తమ ప్రభుత్వ సంక్షేమం, టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు, ఉద్యోగ నియామకాలను అస్త్రంగా చేసుకుని పట్టభద్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక బిజెపి తన అర్బన్ ఓటు బ్యాంకుతో పాటు మోదీ ప్రభుత్వ ఇమేజ్‌తో నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున పేర్లను పంపించి టికెట్ల ఎంపికను కొలిక్కి తెచ్చే పనిలో పడింది. విపక్షాల అభ్యర్థుల ఖరారులో జరుగుతున్న కొంత అభ్యర్థి ఆర్థిక-సామాజిక బలాలు సరిగ్గా కుదిరితేనే కాంగ్రెస్‌ను నిలువరించడం సాధ్యమవుతుందని గులాబీ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే

ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్, అక్టోబర్19: రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరి ష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవె న్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్ని ర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68, 858 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పా రు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ - సర్వేతో పరిష్కారమని పేర్కొన్నారు. సాగుదారులను గుర్తించి చట్టబద్ధ మైన భూ హక్కుల కల్పన చేస్తున్నామని అన్నా రు. నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూహక్కులు కల్పించామని సోదాహరణంగా వివరించారు. సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించామని తెలిపారు. పాస్ పుస్తకాలతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా సహా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు..

భారీగా ఎస్ఐల బదిలీ

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

'నవంబర్‌లోగా కాఫర్ డ్యాం నిర్మించాలి'.. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద

కవిత డిమాండ్

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 19: కాళేశ్వరం ప్రాజెక్టులో భా గమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించారు. కన్నెపల్లి పంప్ హౌజ్ వ్యూ పాయింట్ నుంచి గోదా వరి ప్రవాహన్ని పరిశీలించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించేందుకు కవిత పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు. నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాంను నిర్మించకుంటే కన్నెపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని కవిత అన్నారు. ప్రశ్నించి, పోరాడటమే కాకుండా ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను చెబుతున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితో తాము ఇక్కడ వరకు వచ్చామని తెలిపారు. ఏదో రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశం ఉన్న పార్టీ టీఆర్ఎస్ కాదని.. తాము చేసిన సూచనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని రైతులకు మేలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

కోమటిపల్లిలో పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



- సర్పంచ్ బర్కుంట సుమలత, ఉపసర్పంచ్ చిన్న మల్లేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం

కోమటిపల్లి, అక్టోబర్ 19: దసరా పండుగను పురస్కరించుకుని కోమటిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్ బర్కుంట సుమలత, కారోబార్ రంజిత్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్న మల్లేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొని సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి పండుగ కానుకగా దుస్తులు అందజేశారు. కార్యక్రమం లో సహకరించిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది సేవలు కీలకమని, పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కోమటిపల్లి గ్రామ ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయ దశమి శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

- శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

నిజామాబాద్, అక్టోబర్ 19: విజయ దశమి పండురిగను పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అక్టోబర్ 20న జరుపుకోనున్న విజయ దశమి సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. దుష్టశక్తులపై విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయ దశమి పండుగ స్ఫూర్తితో ప్రజలంతా ఐక్యత, సమగ్రతను కాపాడుతూ సోదరభావంతో మెలగాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, మత సామరస్యానికి భంగం వాటి ల్లకుండా ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ప్రజలు, పోలీసు సిబ్బంది పరస్పర స్నేహభావంతో వ్యవహరిస్తూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలిగా పి. రాణి ఏకగ్రీవ ఎన్నిక

ఆర్మూర్, అక్టోబర్ 18.(విశాల జ్యోతి): పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలిగా బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పి. రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న పి. రాణి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.
ఈ సందర్భంగా పి. రాణి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి సంఘం నాయకులకు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పి. రాణి ఎన్నిక పట్ల బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల షికారి, ఉపాధ్యాయులు అశోక్, గంగాధర్, అరుంధతి, రాము, స్వరూప, గంగప్రసాద్, అరవింద్, గంగామణి, మధుమతి, సుసంద్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజ

- పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): దుర్గామాత నవరాత్రులలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ వాహన పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆయుధ పూజ మన సంప్రదాయాలకు ప్రతీక అని ప్రజల రక్షణ శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయుధాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణ అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ అత్యవసర సమయాల్లో ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించే పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమమైన స్థితిలో ఉంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిరాయత్ నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- పూల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక: ఈరవత్రి రాజశేఖర్
- ఉత్తమంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతుల ప్రదానం

ఆర్మూర్, అక్టోబర్ 19: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, ఆయన సతీమణి సునీత ముఖ్య అతిథులుగా హాజరై మహిళలను ఉత్సాహపరిచారు.
ఈ సందర్భంగా ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. పూలను, ఆడబిడ్డలను పూజించే గొప్ప సంస్కృతి, సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. మన సంస్కృతి, యాస, భాష, ఆలోచనా విధానాలు ధర్మానికి దగ్గరగా ఉంటాయని అన్నారు. పది రోజులుగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్త్రీ అంటే ప్రకృతి.. ప్రకృతి అంటే అమ్మవారు స్త్రీ అంటే ప్రకృతి అని, ప్రకృతి అంటే అమ్మవారని, అమ్మవారు అంటే దైవమని రాజశేఖర్ పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు సంబరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. జిరాయత్ నగర్ కాలనీతో తనకున్న అనుబంధాన్ని, గత జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి కృషి చేసే మంచి నాయకులను ఎన్నుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ అలంకరణతో ఆకట్టుకున్న బతుకమ్మలను ఎంపిక చేసి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, జీవన్, నూకల శేఖర్, టైలర్ వినోద్, కర్తన్ నవీన్, విట్టోబ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చండీయాగ హోమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య

నిజామాబాద్, అక్టోబర్ 19: నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని దుర్గా పరమేశ్వరి మాత మందిరంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చండీయాగ హోమం కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, అదనపు కలెక్టర్లు భుజంగరావు, పి. సురేష్, డీఎంహెచ్‌వో రాజశ్రీతో పాటు ఏసీపీలు, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలు

పటాన్చెరు, విశాలజ్యోతి: పటాన్చెరు పరిధిలో ముత్తంగి డివిజన్‌లో 200 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులకు మరియు ఇతరులకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శాపురం నర్సింహారెడ్డి గారు దసరా పండుగ సందర్భంగా చీరలు, గొడుగులు మరియు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తంగి డివిజన్ ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చేపట్టాలి

- మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించాలి
- సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నవంబర్ నుంచి ప్రారంభించేలా సన్నద్ధం కావాలి
- నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపునకు తక్షణ చర్యలు చెప్పటడంతో పాటుగా మూడు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆనకట్ట వద్ద నీటి నిల్వను పెంచేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలను అధికారులతో సమీక్షించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దుమ్ముగూడెం ఆనకట్ట పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 0.5 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గోదావరి నదిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు జిల్లాలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున రానున్న నెలల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు కారణమవుతున్న సూపర్ ఎల్‌నినో భూతం ప్రభావంతో రానున్న కాలంలో తీవ్రంగా ఉండే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని దక్షిణ భారతదేశంలో వర్షపాతంపై కూడా ప్రభావం పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ జలవనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని దీంతో విద్యుత్ వినియోగం డిమాండ్ కూడా పెరిగి విద్యుత్ కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ కొరత తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని నీరు విద్యుత్ వనరుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద సుమారు ఒక మీటరు ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని విజయదశమి పండుగ రోజైనా పనులకు ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఇసుక బస్తాల ఏర్పాటు ద్వారా సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేసుకునేలా ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నీటి ప్రవాహం తగ్గకముందే పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ఒక టీఎంసీ కంటే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటే రానున్న నెలల్లో మరింత కాలం తాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు చర్యలతో పాటు నీటి వినియోగాన్ని కూడా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. సమీపంలోని ప్రైవేటు జలవిద్యుత్ కేంద్రానికి నీటి వినియోగం విషయంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆనకట్టలో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు నిల్వ ఉన్నప్పుడు అదనంగా ప్రవహించే మిగులు నీటిని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఇతర అవసరాలకు నీటి వినియోగాన్ని నియంత్రించాలని స్పష్టం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి మాట్లాడుతూ వివిధ అనుమతులు న్యాయపరమైన అడ్డంకుల కారణంగా గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందని అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ద్వారా సంబంధిత న్యాయపరమైన అంశాల్లో పురోగతి సాధించామని, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఈ నెలలో లభించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన యంత్రాలు సామగ్రి సిబ్బంది ఇతర వనరుల సమీకరణపై ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత నిర్మాణ సంస్థకు సూచించారు. నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రాజెక్టు పనుల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకోవడం ద్వారా అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పంటల సాగుకు ఎకరానికి లక్ష నుంచి రెండు మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవసరమవుతున్న నేపథ్యంలో పంట చేతికొచ్చే సమయంలో నీరు విద్యుత్ భూగర్భ జలాల కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సాగుకు ముందే నీటి లభ్యత విద్యుత్ సరఫరా భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఆదాయం వచ్చే కూరగాయలు పప్పుదినుసులు వంటి పంటలను అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒకటి లేదా రెండు తడులతో పంట చేతికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా అధిక పెట్టుబడులతో పంటలు సాగుచేసి నష్టపోవడం కంటే అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం మంచిదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పెంపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సంబంధిత శాఖల అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నందిపేట్‌లో గ్రామ పంచాయతీ సిబ్బందికి
దుస్తులు నిత్యావసర వస్తువుల పంపిణీ

● పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలి: సర్పంచ్ ఎర్రం లింగం

నందిపేట్, అక్టోబర్ 19: నందిపేట్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు, నిత్యావసర వస్తువులు, చెప్పులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్రం లింగం, ఉపసర్పంచ్ రామ్ చందర్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రం లింగం మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి వార్డులో పరిశుభ్రతను కాపాడుతూ, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.అలాగే తాగునీటిని పొదుపుగా వినియోగించాలని, అవసరం లేని సమయంలో నల్లాలను మూసివేసి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటం, నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన స్పష్టం చేశారు.గ్రామ అభివృద్ధికి పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ ఎర్రం లింగం పిలుపునిచ్చారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్ల పట్ల
సానుకూలంగా స్పందించాలి

● ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు.

హనుమకొండ, విశాలజ్యోతి: జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, భీమా సౌకర్యం, జీతాల పెంపు, మెటర్నరీ సెలవులు లాంటి ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం ఎందుకు సానుకూలంగా స్పందించడం లేదని ప్రశ్నించినారు. 10 సంవత్సరాలుగా ఎలాంటి వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా, పి.ఆర్.సి వర్తింపజేయకుండా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని అభిప్రాయపడినారు. గ్రామీణ ప్రజలకి విస్తృతమైన వైద్య సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకి సమాన పనికి సమాన వేతనంతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లాంటి ఎనిమిది రాష్ట్రాలలో రెగ్యులరైజేషన్ చేసిన విధంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వారి సర్వీసెస్ ని క్రమబద్ధీకరించే దానికి ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు జీవో.1195 ద్వారా జీతాలు తగ్గిన ఉద్యోగులకి కూడా ప్రభుత్వం న్యాయం చేయాలని అభిప్రాయపడినారు. ఆరోగ్యశాఖ, ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో చర్చించి వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేసినారు

విజయదశమి అందరికీ విజయాలను చేకూర్చాలి

● జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ,వాహన,జమ్మి పూజలు నిర్వహించిన జిల్లా ఎస్పీ

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదినం సుఖసంతోషాలు, విజయాలు, శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆయుధ పూజ, వాహన పూజ, జమ్మి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే పోలీసులు తమవిధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాలను దైవ స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించడం పోలీస్ శాఖలో సాంప్రదాయంగా వస్తోంది” అని జిల్లా ఎస్పీ తెలిపారు. విజయదశమి పర్వదినం సందర్భంగా పోలీస్ అధికారులు,సిబ్బంది పరస్పరం అలాయ్ బలాయ్ నిర్వహించుకుని, స్నేహపూర్వక వాతావరణంలో విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని
తనిఖీ చేసిన రాష్ట్ర సంచాలకులు

వరంగల్ జిల్లా, విశాలజ్యోతి: వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ బి. రవీంద్రనాయక్ గారు ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవుట్ పేషెంట్ (ఓపీ) విభాగం, ల్యాబొరేటరీ, ఫార్మసీ, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫార్మసీ యందు మందుల నిల్వలను క్రమ పద్ధతిలో పెట్టుకోవాలి అని అన్నారు. రాబీస్ నివారణకు సీరం మరియు వ్యాక్సిన్ నిల్వ ఉంచుకోవాలి అని అన్నారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ సిస్టమ్ పాటించాలి అని, ఐ ఎల్ ఆర్ టెంపరేచర్ రికార్డ్ చేయాలి అన్నారు. ఎక్స్పైర్ తేది తేదీని వ్యాక్సిన్ డెలివరీ ముందు పరిశీలించాలి అన్నారు.ప్రోగ్రాం వైజ్ గా ప్రోగ్రాం అధికారులతో కూడా సమీక్ష నిర్వహించి ప్రతి ప్రోగ్రాం పెర్ఫార్మెన్స్ ను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. లెప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్ కార్యాచరణ వివరాలు పరిశీలించారు. హై రిస్క్ గర్భిణీలను, టిఫ్ఫా స్కాన్ లో అబ్నార్మలిటీస్ ఉన్న వారిని, ఎనీమియా వున్న గర్భిణీలను ఫాలో అప్ చేయాలి అన్నారు.
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా కృషి చేయాలని, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ఆసుపత్రిలోని అన్ని విభాగాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రతి ఆరోగ్య సూచికలో మెరుగైన ప్రగతి సాధించాలని సూచించారు. ఎన్ ఎస్ వి కుటుంబ నియంత్రణ కార్యక్రమంలను, సాధారణ ప్రసవం లను చేయాలి అన్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఐ. ప్రకాష్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సాజిదా, డాక్టర్ ఇక్థిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, వైద్యాధికారి డాక్టర్ సరోజ, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్వో), స్టాఫ్ నర్సులు, హెల్త్ విజిటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి గా ఎంపికైన
మనీషా అనంత్ రెడ్డికి ఘన సత్కారం

● శాలువాతో సన్మానించి భగవద్గీత అందజేసిన చేవెళ్ల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్

చేవెళ్ల అక్టోబర్ 19 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి శ్రీపాల్ న్యాయవ్యవస్థలో తెలుగు బిడ్డ సత్తా – యువతకు స్ఫూర్తిగా మనీషా అనంత్ రెడ్డికి – అభినందనల వెల్లువన్యాయవ్యవస్థలో తన ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధి రోహిస్తున్న యువ న్యాయవాదిని, హైకోర్టు జూనియర్ జడ్జిగా ఎంపికైన మనీషా అనంత్ రెడ్డి చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.ఆదివారం మహాలింగాపురం గ్రామంలోనీ ఆమె నివాసంలో వెంకటేష్ మనీషా అనంత్ రెడ్డినీ కలిసి, శాలువాతో సత్కరించి, పవిత్ర భగవద్గీత పుస్తకాన్ని బహూకరించి అభినందనలు తెలిపారు. న్యాయం, ధర్మం, సత్యం అనే భగవద్గీత సూత్రాలను ఆమె తన న్యాయ ప్రస్థానంలో పాటించాలని ఆకాంక్షించారు.
యువతకు స్ఫూర్తి:ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ మాటాడుతూ… “మనీషా అనంత్ రెడ్డి చిన్న వయసు లోనే కష్టపడి చదివి, హైకోర్టు జూనియర్ జడ్జిగా ఎంపిక కావడం మనందరికీ గర్వకారణం. ముఖ్యంగా బీసీ, మహిళా వర్గాలకు ఆమె ఒక స్ఫూర్తి. ఆడపిల్లలు చదువుకుంటే ఏ స్థాయికి ఎదగగలరో ఆమె నిరూపించారు. న్యాయవ్యవస్థలో తెలుగు బిడ్డగా ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, బడుగు బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో తనదైన ముద్ర వేయాలని కోరుకుంటున్నాం. ఆమెకు భగవద్గీత ఇవ్వడం వెనుక కారణం ఏమిటంటే, న్యాయమూర్తి ఎప్పుడూ ధర్మాన్ని వీడకూడదు. కృష్ణుడు అర్జునుడికి చెప్పినట్లుగా ధర్మాన్ని నిలబెట్టాలి” అని తెలిపారు.మనీషా అనంత్ రెడ్డి మాట్లాడుతూ… బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ తనను కలిసి సత్కరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, రాజ్యాంగానికి లోబడి, నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తానని హామీ ఇచ్చారు.
అభినందనల వెల్లువమనీషా అనంత్ రెడ్డి ఎంపిక పట్ల చేవెళ్ల నియోజకవర్గంలోని న్యాయవాదులు, బీసీ సంఘం నాయకులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.ఈ సత్కార కార్యక్రమంలో బౌరంపేట రామ్మోహన్ రెడ్డి ,పలువురు బీసీ సంఘం నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ మహిషాసుర మర్దనీ దేవి
అలంకరణలో అమ్మవారు

● పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైటర్ బస్తి ఏరియా సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారంశ్రీ మహిషాసుర మర్దనీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమార్చన కూడా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ వి త్యాగరాజ శర్మ, అర్చకులు ఎల్వి పవన్ శర్మలు గోత్రనామాలు చదివిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బోనాల వేడుకల్లో బండ లక్ష్మీ, ప్రవళిక రెడ్డి

● ప్రొద్దుటూరు గ్రామ శ్రేయస్సు, ఐక్యత, అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు

చేవెళ్ల అక్టోబర్ 19 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి శ్రీపాల్
ప్రొద్దుటూరు తెలంగాణ సంస్కృతిసంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకల్లో ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ, శంకర్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ బొల్లారం ప్రవళిక రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో ఐక్యత వెల్లివి రియాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

చిన్న వయసులోనే ఎముకల బలంపై శ్రద్ధ..
ఆస్టియోపోరోసిస్ ముప్పును తగ్గించుకోండిలా..

ఆస్టియోపోరోసిస్ (ఎముకల సాంద్రత తగ్గి బలహీనపడే వ్యాధి) కారణంగా ఎముకలు బలాన్ని కోల్పోయి, చిన్న దెబ్బలకే విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా మెనోపాజ్ దశ దాటిన మహిళల్లో ఈ ముప్పు అధికంగా కనిపిస్తుంది. అయితే వృద్ధాప్యంలో ఉన్న పురుషులు, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు. ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యాలు, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వంటి అంశాలు ఎముకల సాంద్రత తగ్గడానికి కారణమవుతాయి.

చిన్న వయసులో జాగ్రత్తలు అవసరం..

వృద్ధాప్యంలో ఎముకల ఆరోగ్యం ఎలా ఉంటుందనేది చిన్న వయసులో మనం తీసుకునే జాగ్రత్తలపైనా ఆధారపడి ఉంటుంది. సాధారణంగా 20 నుంచి 30 ఏళ్ల మధ్య శరీరం గరిష్ఠ ఎముక ద్రవ్యరాశిని అభివృద్ధి చేసు కుంటుంది. ఈ వయసులో శారీరకంగా చురుకుగా ఉండి, క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారిలో ఎముకల బలం మెరుగ్గా ఉంటుంది. వయసు పెరిగేకొద్దీ ఎముకల సాంద్రత క్రమంగా తగ్గినా, చిన్న వయసులో ఏర్పడిన ఈ అదనపు బలం కొం తవరకు రక్షణగా నిలుస్తుంది. ఎముకల ద్రవ్య రాశిని పెంచడంలో, దాన్ని కాపాడుకో వడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. చురుకైన నడక, పరుగెత్తడం, శరీర బరువును ఎముకలు భరించేలా చేసే తగిన శారీరక కార్యకలాపాలు ఎముకల నిర్మాణాన్ని ప్రేరేపిస్తాయి. తక్కువ ప్రభావంతో కూడిన క్రీడలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. బరువులతో చేసే వ్యాయామాలు కండరాల బలాన్ని పెంచడంతోపాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తాయి. దీనివల్ల వృద్ధాప్యంలో పడిపోవడం, ఎముకలు విరగడం వంటి ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

వ్యాయామం తప్పనిసరి..

ఎముకల సాంద్రత తగ్గిన తర్వాత వ్యాయామం ప్రారంభించడం కంటే, శారీరక శ్రమను చిన్న వయసు నుంచే జీవనశైలిలో భాగం చేసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. యువతలో వ్యాయామ అలవాట్లు భవిష్యత్తులో శరీరంలో ఎంత ఎముక ద్రవ్య రాశి నిల్వ ఉంటుందనే అంశాన్ని ప్రభావితం చేస్తాయి. వృద్ధులు కూడా చురుకుగా ఉండడం ద్వారా ఎముకల క్షీణత వేగాన్ని తగ్గించుకోవడంతోపాటు కదలికల సామర్థ్యాన్ని కాపాడుకోవచ్చు. కాల్షియం అందించడంలో పాలు, పాల ఉత్పత్తులు ఉపయోగపడతాయి. అయితే ఎముకల ఆరోగ్యం కోసం కేవలం పాల ఉత్పత్తులపైనే ఆధారపడడం సరిపోదు. వయసు పెరిగేకొద్దీ జీర్ణవ్యవస్థ సమస్యలు, ఇతర ఆరోగ్య పరిస్థితుల కారణంగా కాల్షియంతోపాటు పలు పోషకాలను శరీరం గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది. ఆహారంలో వివిధ రకాల కాల్షియం అధికంగా ఉండే పదార్థాలను చేర్చుకోవాలి. ఎముకలతో సహా తినే చిన్న చేపలు, రాగులు, చిరుధాన్యాలు, బాదం పప్పు కాల్షియం అవసరాలను తీర్చడంలో తోడ్పడతాయి. ఒకే ఆహార పదార్థం లేదా పోషకాహార సప్లిమెంట్‌పై ఆధారపడడం కంటే, విభిన్న పోషకాలు అందించే సమతుల ఆహారం తీసుకోవడం మంచిది.విటమిడి అందేలా చూసుకోవాలి..కాల్షియంను శరీరం గ్రహించేందుకు విటమిన్ డి కూడా అవసరం. విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు కాల్షియం తీసుకోవడం పెంచినంత మాత్రాన ఆశించిన ప్రయోజనం లభించదు. వయసు, ఆహారపు అలవాట్లు, సూర్యరశ్మికి ఎంత సమయం గురవుతున్నారు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వైద్యులు విటమిన్ డి సప్లిమెంట్లను సూచిస్తారు. ఎముకల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే నివారించదగిన అంశాల్లో ధూమపానం కూడా ఒకటి. దీర్ఘకాలంగా ధూమపానం చేసేవారిలో చిన్న వయసులోనే ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ధూమపానం ఎముకల సాధారణ జీవక్రియకు ఆటంకం కలిగించి, ఎముకల సాంద్రత తగ్గడానికి దోహదం చేస్తుంది. ధూమపానం చేసే అలవాటు ఉంటే దాన్ని మానుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యంతోపాటు గుండె, ఊపిరితిత్తులు, మొత్తం శరీర ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండే అలవాటును కూడా తగ్గించుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల్లో ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం వల్ల ఎముకలు, కండరాల బలం వేగంగా తగ్గే అవకాశం ఉంటుంది.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

నామమాత్రంగా కొత్త ఓట్ల దరఖాస్తులు - ములుగులో 751 మాత్రమే

హైదరాబాద్: తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో కొత్త ఓటర్ల నమోదు కోసం అందిన దరఖాస్తుల సంఖ్య నామమాత్రంగా ఉంది. 'సర్?'లో భాగంగా ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 7 వరకు ఫారం-6 ద్వారా 1,70,374 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఎన్నికల సంఘం మాత్రం సుమారు 4.88 లక్షల దరఖాస్తులు అందినట్లు గతంలో ప్రకటన చేసింది. అయితే ఇవన్నీ అభ్యంతరాలు, ఫిర్యాదుల కాలంలో అందినవి కావని తెలుస్తోంది. అంతకు ముందు అందిన వాటిని కూడా కలిపారు.రాష్ట్రంలో 'సర్?' సర్వేలో భాగంగా ముసాయిదా జాబితా ప్రచురించిన రోజున ఓటర్ల నమోదు పత్రాలు సమర్పించకపోవడం, చిరునామా లేకపోవడం, శాశ్వత వలస, మరణం, డూప్లికేట్ ఓట్ల కారణంగా 73.39 లక్షల ఓట్లను తొలగించారు. అనేక చోట్ల అర్హులైన ఓటర్లు ఉన్నప్పటికీ, బీఎల్‌వోలు ఎలాంటి విచారణ లేకుండానే, వారిని తొలగించారని రాజకీయ

పార్టీలు ఆరోపించాయి.ఏఎస్?డీడీ జాబితా నుంచి పొరపాటున తమ ఓటు తొలగిస్తే, ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. అయితే అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో కేవలం 1,70,374 దరఖాస్తులు మాత్రమే అందాయనేది గమనార్హం. దీనికి అదనంగా ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన శిబిరాల ద్వారా 36,771 దరఖాస్తులు అందాయి. అంటే 'సర్' కార్యక్రమంలో భాగంగా ఏఎస్?డీడీ జాబితా ప్రకటించిన తర్వాత, అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో అందిన మొత్తం ఫారం-6 దరఖాస్తులు కేవలం 2,07,146 మాత్రమే.ఏడాది ప్రారంభం నుంచి 10.45 లక్షల దరఖాస్తులుఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు, కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా 10,45,519 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇప్పటివరకు 5,12,960 దరఖాస్తులను ఎన్నికల అధికారులు ఆమోదించి, వారి పేర్లను తుది జాబితాలో చేర్చారు. సరైన పత్రాలు లేకపోవడం వల్ల 2,23,416 దరఖాస్తులు తిరస్కరించారు. మరో 3,09,143 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. వీటిని కూడా పరిశీలించి, అర్హులైన వారిని నవంబర్ 9న ప్రకటించబోయే 'సర్-2026' తుది జాబితాలో చేర్చనున్నారు. సర్?లో భాగంగా కేవలం అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ కాలంలో కొత్త ఓటరు నమోదు కోసం అత్యధికంగా 39,101 దరఖాస్తులు హైదరాబాద్‌లో అందగా, అత్యల్పంగా 751 దరఖాస్తులు ములుగులో అందాయి.

మీ పాత్ర లేకపోతే సీబీఐ విచారణ చేపట్టండి..

హైదరాబాద్ : మాక్స్‌బియన్ ఫార్మా కానీ, మైండ్‌వాల్ట్ కార్పొరేట్ స్కూల్స్ కానీ, మెడికవర్ ఆస్పత్రుల మీద వస్తున్న ఆరోపణలపై అక్కడున్న మీడియా వాళ్లు అడిగినపుడు రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో మొదలేమో తనను పెయిడ్ క్వశ్చన్స్ అడగకండి అన్నరు.. తర్వాతేమో ఒక్క ఆధారమ న్నా చూపించండి అన్నరు. ఇవన్నీ అంశాలల్లో కూడా కొన్ని నెలల నుంచి ఆధారాలు బయటపెడుతూనే ఉన్నామని బీఆర్ ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ తెలిపారు.తెలంగాణ

భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. . ఎట్లా ఒక ఆస్పత్రిని రూ.13200కు అమ్మేస్తరు.. ఆ ఆస్పత్రిలో ఉన్న డైరెక్టర్లలో అల్లుడు మాక్స్‌బియన్ ఫార్మాలో ఉంటరు.. అమ్మాయి నిర్మాణాలు చేస్తున్న కార్పోరేట్ స్కూల్స్ అయిన మైండ్‌వాల్ట్స్‌లో ఉంటరు.. ఇవాళ ఇవన్నింటి మీద ప్రశ్నలు అడిగినప్పుడు రేవంత్ రెడ్డి దగ్గర సమాధానం లేదు.. ఎదురేమో రకరకాల దుష్ప్రచారం చేస్తరని మన్నె క్రిశాంక్ ఆరోపి ంచారు.వారికి, వారి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ఛానళ్లు, పత్రికల్లో కేటీఆర్, కేసీఆర్‌మీద దుష్ప్రచారాలు చేయడం..వాళ్లు నేరుగా వచ్చి సమాధానాలు కూడా చెప్పడం,, కేటీఆర్, హరీశ్ రావు సమాధానాలు చెప్పడం, కేసీఆర్ లీగల్ గా ఎదుర్కోవడం, కమిషన్‌కు సమాధానాలు చెప్పడం.. అవును రేవంత్ రెడ్డి మీకు సంబంధం లేకపోతే విచారణ చేపట్టండి. సులభంగా అయిపోతది.. ఇవేమిట్లో కూడా మీ పాత్ర లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించండి అయిపోతది. ఆ సీబీఐ ముందు మేం పోయి డాక్యుమెంట్స్ పెడతం. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో సీబీఐ రావాలంటే రేవంత్ రెడ్డి అనుమతి ఉండాలి. మరి రేవంత్ రెడ్డి ఇందులో ఏం లేదు ఒక్క ఆధారం కూడా లేదన్నప్పుడు .. మీరు అంత క్లీన్‌గా ఉన్నపుడు ఇక్కడ పెట్టిన ఈ అంశాల మీద సీబీఐ విచారణ పెట్టండి.. మేమే ఈ డాక్యుమెంట్స్ , డైరెక్టర్స్, షేర్ హోల్డర్స్ అన్నీ పెడతమన్నారు మన్నె క్రిశాంక్ .

హైదరాబాద్‌లో నకిలీ నంబర్ ప్లేట్లపై పోలీసుల ఉక్కుపాదం.. 100 మందిపై కేసులు

హైదరాబాద్, అక్టోబర్ 19:
నకిలీ నంబర్ ప్లేట్ల వాహనాలపై నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యే క తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా వాహనాలు సీజ్ చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు వినియో గిస్తున్న 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గత 8 నెలల్లో 88 ద్విచక్ర వాహనాలతోపాటు12 కార్లను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. నకిలీ, మార్చిన, అనధికారిక నంబర్ ప్లేట్లు చట్ట రీత్యా నిషేధమని నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం

చేశారు.హెచ్ఎస్ఆర్‌పీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద నంబర్ ప్లేట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని వారికి ట్రాఫిక్ పోలీసులు సూచించారు. నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగించడం వల్ల వాహనాలు గుర్తించడం కష్టమవుతుందని పోలీసులు పేర్కొన్నారు. ఇది నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతకు సవాలుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక వాహనదారులు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ సంబంధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేస్న?న్నారు. నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లనే అమర్చుకోవాలని సూచిస్తున్నారు. రిజిస్ట్రేషన్ నంబరులో ఎలాంటి మార్పులు చేయవద్దని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేసి.. వాహనాలు సీజ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు.. భారీగా ఎస్ఐల బదిలీ

హైదరాబాద్ :
హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 75 మంది ఎస్ఐల బదిలీ పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పాలనాపరమైన మార్పులు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని సీపీ సజ్జనార్ ఆదేశం
ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తున్న వారిని బదిలీ చేసినట్లు వెల్లడి హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది.బదిలీ అయిన అధికారులు తక్షణమే

తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

రేవంత్ అసమర్థతో హరిగోస పడుతున్న రైతాంగం : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

మహబూబ్ నగర్ : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లాలోని పెద్దగూడెం తండాలో కరెంట్ కోతలతో ఎండిపోయిన వరి పంటలను బీఆర్ఎస్) శ్రేణులతో కలసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు.ఇది నిజమైన కరువు కాదని, ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్ నినో పేరుతో కాలం వెలిబుచ్చు తున్నా రని విమర్శింఆచరు. పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా సమీక్ష నిర్వహించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంపై ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండున్న ర కోట్ల మంది రైతులు ఆధారపడి ఉన్నార, ని వారంతా ప్రభుత్వంపై తిరగబడే అనివార్యత ప్రభుత్వమే కల్పించిం దని పేర్కొన్నారు. రైతులు

అధైర్య పడొద్దని అండగా ఉంటామని, ప్రభుత్వంతో పోరాడి నష్టపరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఓటు వేసినందుకు చెప్పుతో కొట్టుకుంటామని బహిరంగం చెబుతున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డికి కరెంట్ సరఫరాపై అవగాహన, సోయి లేదని అన్నారు. నేటికి శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీటి లభ్యత ఉందని, నీటి లభ్యత ఉన్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడుపతలేరని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడపడంలో ఘోరమైన వైఫల్యం చెందిందని వెల్లడించారు.ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్ , నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, ధర్మా నాయక్, మాధవ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, శంకర్ నాయక్, చిట్యాల రాము, నారాయణ నాయక్, టీక్యా నాయక్, గోవిందు నాయక్, అలీం పాల్గొన్నారు.

తెల్ల 'బంగారం'.. జమ్మికుంట మార్కెట్‌లో క్వింటాల్ రూ.9,200

జమ్మికుంట(కరీంనగర్): పత్తి రైతులకు ఈ ఏడాది ధరలు ఊరటనిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలోనే మద్దతు ధరను మించి లభిస్తుండ డంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం క్వింటాల్ పత్తికి గరిష్ఠంగా 9,200 రూపాయల ధర పలికింది. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గత సీజన్‌లో సీసీఐ క్వింటాల్‌కు 8,110 మద్దతు ధర చొప్పున 10,666 మంది రైతుల నుంచి 1,45,057 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఇదే సమయంలో ప్రైవేటు వ్యాపారులు 1,18,638 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది పత్తికి ప్రభుత్వం క్వింటాల్‌కు 8,667 రూపా యలు మద్దతు ధర నిర్ణయించగా, మార్కెట్‌లో అంతకుమించి ధరలు పలుకుతున్నాయి.సెప్టెంబరు23 నుంచి కొత్త పత్తి మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. తొలి రోజుల్లో క్వింటాల్‌కు రూ.8600 వరకు ధర పలకగా.. రోజులు గడుస్తున్న కొద్దీ పత్తి నాణ్యత పెరగడం, వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.ఈ సీజన్‌లో మార్కెట్‌కు ఇప్పటివరకు 2,500 క్వింటాళ్ల పత్తి వ చ్చింది. మంగళవారం జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌కు సుమారు 150 వాహ నాల్లో 690 క్వింటాళ్ల పత్తి రాగా, గరిష్ఠ ధర 9,200, మోడల్ ధర 8,900, కనిష్ఠ ధర ఎనిమిది వేల రూపాయలు లభించింది.

ఉపాధి కల్పనే ధ్యేయంగా అడుగులు - 5,341 సంస్థల స్థాపనకు ప్రభుత్వం ఆమోదం

హైదరాబాద్: రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే పారిశ్రామిక విస్తరణపై దృష్టిసారించింది. రాజధానిలోనే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలకు సైతం పరిశ్రమలు విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. గడిచిన 26 నెలల సమయంలోనే రాష్ట్రంలో 5,341 సూక్ష్మ మధ్య, భారీ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.38,341.93 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో

తెలంగాణలో 1,31,083 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.పెట్టుబడుల విస్తరణపై దృష్టిరా ష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యే రంగాల్లో కార్యకలాపాలు విస్తరించడం, పరిశ్రమల సంఖ్య కంటే వాటిలో పెట్టుబడుల విలువ అధికంగా ఉండేలా చూడటం వంటివి రాష్ట్ర పారిశ్రామిక రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంకేతంగా ప్రభుత్వం భావిస్తోంది. పెట్టుబడుల అభివృద్ధి విధానాలపై పరిశ్రమల శాఖ తాజాగా ప్రభుత్వానికి నివేదించింది.

జేఎన్‌టీయూలో అద్భుతం రివర్స్ బోర్లతో పెరుగుతున్న భూగర్భ జలాలు

హైదరాబాద్: సాధారణంగా హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా భూగర్భ జలాలు అడుగంటిపోతుంటాయి. వేసవి వచ్చిందంటే చాలు ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు తప్పవు. కానీ జేఎన్‌టీయూ క్యాంపస్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు ఎంత ఉన్నా భూగర్భ జలాలు మాత్రం సమృద్ధిగా ఉంటున్నాయి. ఇందుకు కారణం ఆ వర్సిటీ అనుసరిస్తున్న వినూత్న వర్షపు నీటి సంరక్షణ విధానమే.వర్షపు నీటి నిల్వకు రివర్స్? బోర్ల ఏర్పాటుప్రకృతి ప్రసాదించిన ప్రతి చుక్కనూ ఒడిసిపట్టి భూమిలోకి పంపాలనే ఉద్దేశంతో జేఎన్‌టీయూ జలవనరుల శాఖ ఈ బృహత్తర ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా క్యాంపస్ ప్రాంగణంలో వినూత్న రీతిలో రివర్స్ బోర్లను ఏర్పాటు చేశారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఏకంగా 11 ప్రాంతాల్లో 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, 10 అడుగుల లోతు ఉండే భారీ నీటి తొట్టెలను నిర్మించారు.ఈ తొట్టెలలోకి చేరిన వర్షపు నీరు ఎలాంటి వృథా లేకుండా, కేవలం క్షణాల

వ్యవధిలో భూమి 200 అడుగుల లోతుకు వెళ్లేలా పకడ్బందీ సాంకేతిక ఏర్పాట్లు చేశారు. గురుత్వాకర్షణ శక్తి కారణంగా ఈ బావుల్లోకి ప్రవేశించిన నీరు వేగంగా భూమిలోకి ఇంకుతుంది. అలా రూ. 40 లక్షల వ్యయంతో మొత్తం 24 చోట్ల ఈ బోర్?వెల్స్‌ను ఏర్పాటు చేశారు.ప్రతి ఏడాది సుమారు 8 కోట్ల లీటర్ల నీరు భూమిలోకిఈ అద్భుతమైన విధానం ద్వారా జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రతి సంవత్సరం సుమారు 8 కోట్ల లీటర్ల వర్షపు నీరు భూగర్భంలోకి చేరుతోంది. ఫలితంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోతున్నా, క్యాంపస్‌లో మాత్రం జలకళ తప్పకుండా ఉంది. ఇక్కడ వేసవిలో సైతం భూగర్భ జలమట్టం కేవలం 15 నుంచి 20 మీటర్ల లోతులోనే ఉంటోందని, శీతాకాలంలో ఇది 10 మీటర్ల కంటే తక్కువగా నమోదవుతోందని జలవనరుల శాఖ ప్రొఫెసర్ ఎం.వి.ఎస్. గిరిధర్ తెలిపారు. దీనివల్ల క్యాంపస్‌కు బయటి నుంచి తాగునీటి ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన అవసరమే లేకుండా పోయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతిని రక్షించుకుంటూ, నీటిని వృథా చేయకుండా జేఎన్‌టీయూ చూపుతున్న ఈ చొరవ హైదరాబాద్?లోని ప్రతీ ఒక్కరికీ, ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.